సాక్షి
బాపట్ల
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



అనధికార దాబాలపై దాడులు

వినుకొండ : అనధికార రెస్టారెంట్‌లు, దాబాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వినీల తెలిపారు.



భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలు

మాచర్ల: చెంచు కాలనీలోని అమ్మవారి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. రెండు వేల మందికి అన్నదానం చేశారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: నాగార్జున సాగర్, కృష్ణా నది పరివాహక ప్రాంతాల నుంచి పులిచింతలకు 1,39,044 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 1,36,810 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆటోకు ఉచిత దెబ్బ

డిగ్రీలు చదివినా ప్రభుత్వ ఉద్యోగాలు రాక కొందరు...చదువు లేక మరికొందరు ఆటోలను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేక బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఆటో కొనుగోలు చేస్తున్నారు. నెలనెలా ఈఎంఐలు చెల్లిస్తూ మిగిలిన సొమ్మును కుటుంబాలను నడుపుతున్నారు. మరికొందరు ఆటోలు అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. దీంతో ఆటోవాలాల ఉపాధికి దెబ్బతగిలింది. ఎన్నికల సమయంలో ఆటోవాలాలకు ఏడాదికి రూ.15000 ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు దాని ఊసే ఎత్తడం లేదు. ప్రభుత్వ నిర్ణయంపై డ్రైవర్లు మండిపడుతున్నారు.

- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభం
- ఉపాధి కోల్పోనున్న ఆటో డ్రైవర్లు
- రూ.15 వేలు ఊసే ఎత్తని సర్కార్
- ఏడాదిగా ఆందోళన చేసినా పట్టించుకోని వైనం
- కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం



బాపట్ల అర్బన్: కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఆటో డ్రైవర్లలో ఆందోళన మొదలైంది. స్త్రీ శక్తి పథకం తమ ఉపాధిని దెబ్బతీసేలా ఉందని భయపడుతున్నారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేశామని, రేపటి నుంచి అప్పులు ఎలా తీర్చాలని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపు 30 వేలకు పైగా ఆటోలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వీటిపై ఆధారపడి జీవించే వారి సంఖ్య వేలల్లో ఉంటుంది.

14 నెలలైనా అమలు కాని హామీ

తాము అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు ఏటా రూ.15000 ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆర్థిక సాయంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని నమ్మబలికింది. అధికారం చేపట్టి 14 నెలలు అవుతున్నా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ అమలు కాలేదు. అమలు చేస్తామని స్పష్టమైన హామీ లేదు. దీనికితోడు సంక్షేమ బోర్డు మాటే ఎత్తటం లేదు. తక్కువ వడ్డీతో ఆటోలకు రుణాలు ఇస్తామని హామీకి అతీగతి లేదు. స్త్రీ శక్తి పథకం అమలు చేయడంతో ఆటో కార్మికులు జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. ఉచిత బస్సు ప్రభావంతో ఫైనాన్స్ చెల్లించలేని పరిస్థితి వస్తుందని వాపోతున్నారు.

మా పొట్ట కొట్టినట్లే..



దాదాపు 20 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా. ఇదే మా జీవనాధారం. దీని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఆటోలో ప్రయాణించే వారిలో 80 శాతం మహిళలే. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో ఎక్కే వారు ఉండరు. మా పొట్ట కొట్టినట్లే. మేము ఉపాధి కోల్పోతాం. ఆటో అప్పు తీర్చడం కష్టమే.

–వల్లు వెంకటేశ్వర్లు, దేవినూతల

రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలి



ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు 50 నుంచి 60 శాతం ఉపాధి కోల్పోతారు. ప్రభుత్వం అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని ఇవ్వలేదు. ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఉపాధి కోల్పోతున్న కార్మికులకు నెలకు రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలి.

–యారం కొర్నేలుబాబు, బాపట్ల

హామీల అమలు లేదు



కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తామన్న హామీ అమలు కాలేదు. ఆర్థిక సాయం ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టత లేదు. ఏడాది కాలంగా అనేక ఆందోళనలు చేశాం. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదు. రుణాలు ఇవ్వలేదు. ఇప్పుడు ఉచిత బస్సు వల్ల ఉపాధి కోల్పోతాం.

–మల్లవరపు సాంబయ్య, బాపట్ల



రారా.. కృష్ణయ్యా...!



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం వైభవంగా జరిగాయి. ముఖ్యంగా వైష్ణవాలయాలు ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి. హరే కృష్ణ ... హరే కృష్ణ ... కృష్ణ కృష్ణ ... హరే హరే అంటూ భక్తులు కృష్ణ నామస్మరణ చేశారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. సామూహిక గీతా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

– భట్టిప్రోలు

ఉప్పరపాలెం గేట్ వారం రోజులు మూసివేత



బాపట్ల ఉప్పరపాలెం గేట్ వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతులు చేస్తున్న కారణంగా మూసి వేశారు. రైల్వే గేట్ రాకపోకలు మరో వారం రోజులు నిలుపుదల చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. – బాపట్ల

న్యూస్‌రీల్

వ్యవసాయ శాఖ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ మూత



వేమూరు: రైతులు సాగు చేస్తున్న పంటలకు వాడే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్ష చేసేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను కూటమి ప్రభుత్వం మూత వేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గం కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే వేమూరు నియోజకవర్గంలోని మార్కెట్ యార్డులో ల్యాబ్‌ను నిర్మించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యతను పరిశీలించేందుకు ఇద్దరు విస్తరణాధికారులను నియమించారు. 2023- 2024 వరకు ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు టెస్టింగ్ ల్యాబ్ ద్వారా పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను మూత వేసేందుకు కుట్ర పన్నింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు టెస్టింగ్ ల్యాబ్‌కు రాకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు మూత వేశారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ శాఖ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను తెరిపించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నల్లబర్లీ సక్రమంగా కొనుగోలు జరిగేలా చూడాలి



జె.పంగులూరు: వర్షాకాలం వచ్చిందని నల్ల బర్లీ పొగాకు సక్రమంగా కొనుగోలు జరిగేలా చూడాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు ప్రభుత్వాన్ని కోరారు. పంగులూరు గ్రామంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రామారావు మాట్లాడారు. రైతులు ఇప్పటికే పొగాకు మడేలు కట్టి సుమారు ఆరు నెలలైందని, పొగాకు నాణ్యత లోపించిందని తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారులు కూడా నాణ్యత ప్రమాణాలు బట్టి క్వింటా పొగాకు రూ.6 వేలు నుంచి రూ.9 వేలకు మించి కొనుగోలు చేయడం లేదని అన్నారు. 30 శాతం వరకు పొగాకు బేళ్ల రిజెక్ట్ చేస్తున్నారని, తద్వారా రైతులు ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు నష్టపోతున్నారన్నారు. గ్రామాల్లో కొంత మంది రైతుల పేర్లు రాక, మండెలు అలానే ఉన్నాయని, స్టాక్ గోదాంలు లేవని ఈ వారం కొనుగోలు నిలిపివేశారన్నారు. మొదట ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లోనే కొనుగోలు జరపాలని, అక్కడి నుంచి మార్క్‌ఫెడ్ వారు వేరే ప్రాంతాలను తరలించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు నష్టపోయారని.. దూరప్రాంతాలకు పొగాకు బేళ్లు తీసుకురావాలని కోరడం భావ్యం కాదని, ప్రభుత్వమే ఖర్చు భరించాలని కోరారు. కొనుగోలు ప్రారంభించి సుమారు 60 రోజులైనా ఇంతవరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పారని, ఆ హామీ అమలు కాలేదని రామారావు అన్నారు.

రౌడీషీటర్ నవీన్‌పై పీడీ యాక్ట్ నమోదు

తెనాలి రూరల్: గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్ చెందిన రౌడీషీటర్ వేము నవీన్‌పై పీడీ యాక్ట్ నమోదైంది. జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు అతడిని అదుపులోకి తీసుకుని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెనాలి టూటౌన్ సీఐ రాములనాయక్ శనివారం తెలిపారు. నవీన్‌పై గతంలో కొట్లాట, దోపిడీ, గంజాయి కేసులు నమోదయ్యాయి. ఇటీవల కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై దాడి కేసులో నవీన్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ, రౌడీషీటర్లపై తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నవీన్‌పై పీడీ యాక్టు నమోదైందని సీఐ వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాలువలోకి బోల్తా పడిన కారు



కర్లపాలెం: కర్లపాలెంలో కాలువ వంతెనకు సైడ్‌వాల్స్ లేకపోవటంతో ఓ కారు కాలువలోకి బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శనివారం కర్లపాలెంలోని బాపయ్య కొట్టు ఎదుట పాత ఇస్లాంపేటకు వెళ్లే ఇసుక చానల్ వంతెనపై నుంచి ఓ కారు కాలువలోకి బోల్తా పడింది. ప్రమాద సమయంలో కాలువలో నీరు ఉండటం వల్ల కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

ధైర్యానికి దిశ.. 'శక్తి'తో నిరాశ

- రెచ్చిపోతున్న ఆకతాయిలు
- దిశ యాప్ ఉన్నప్పుడు క్షణాలలో యంత్రాంగం స్పందన
- నేడు శక్తి యాప్‌పై అవగాహన కూడా కల్పించని సర్కారు
- బాధితుల రక్షణకు చంద్రబాబు పాలనలో అదే నిర్లక్ష్యం

ఆడబిడ్డకు అండగా నిలవాలనే ధ్యేయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన 'దిశ'.. ఆపన్నుల గుండెల్లో ధైర్యం నింపింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో రూపుదిద్దుకున్న యాప్‌తో ఎందరో రక్షణ పొందారు. కానీ నేడు కూటమి పాలకులు తెచ్చిన 'శక్తి' యాప్‌తో భరోసా కాదు కదా.. కనీసం యాప్ ఉన్న విషయం కూడా చాలామందికి తెలియదు.

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో దిశ పోలీసు స్టేషన్‌లను ప్రారంభించి, యాప్ అందుబాటులోకి తెచ్చారు. మహిళలు, యువతులు, బాలికలు తమ సమస్యలు చెబితే తక్షణ సాయం అందేది. సేవ్ అవర్ సోల్స్ (ఎస్‌వోఎస్)కు కాల్ చేస్తే క్షణాల్లో పోలీసులు రక్షించారు. కాకాని రోడ్డులో ఒక దుర్మార్గుడి చేతిలో హత్యకు గురైన బీటెక్ విద్యార్థిని రమ్య కేసులో అప్పటి స్టేషన్ ఎస్‌హెచ్‌వో కె. వాసు కేవలం 20 రోజులలోపు చార్జిషీటు దాఖలు చేశారు. ఏడు నెలల్లో నిందితుడికి ఉరిశిక్ష పడింది. ప్రత్యేక కోర్టుల ద్వారా ఈ శిక్ష పడేలా చేశారు. మైనర్‌లపై అత్యాచారాలకు ఒడిగట్టిన వారికి శిక్షలు పడేలా చర్యలు చేపట్టారు. దిశ యాప్ ప్రారంభమైన నాటి నుంచి 2024 ఎన్నికల వరకు 1.30 కోట్ల మందికిపైగానే సేవలను వినియోగించుకున్నారు. గుంటూరు రేంజ్ పరిధిలో 11.13 లక్షల మంది సేవలు పొందారు. దిశ ఎస్‌ఓఎస్ ఫోన్‌కాల్స్ అందుకున్న వెంటనే 2,300 మందిని ఆపద నుంచి రక్షించారు. 403 మందిని ఇంటికి సురక్షితంగా చేర్చారు. దిశ యాప్‌నకు సంబంధించి నమోదు అయిన కేసుల్లో 96 శాతం చార్జ్‌షీట్లు నిర్ణీత వ్యవధిలో కోర్టుకు సమర్పించారు. సగటున బాధితుల నుంచి 60 నుంచి 70 ఫోన్ కాల్స్ వచ్చేవని అధికారులు చెప్పారు.



యువతులకు దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న మహిళా కానిస్టేబుల్ (ఫైల్)

జిల్లా	'దిశ' ఎస్ఓఎస్ కాల్స్	ఎఫ్ఐఆర్ నమోదు/ చర్యలు తీసుకున్నవి
గుంటూరు	78,724	1,781
బాపట్ల	14,600	883
పల్నాడు	15,171	1,105

రక్షణ చర్యలు తీసుకుంటాం



నిత్యం కళాశాలల వద్ద రక్షక్ వాహనాలు ఏర్పాటు చేస్తాం. ఆకతాయిలపై దృష్టి సారించి వారిపై తగిన కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సిబ్బందిని ఉమెన్స్ కళాశాల వద్ద ఉదయం, సాయంత్రం సమయాల్లో బందోబస్తు నిర్వహించాలని ఆదేశించాం. అవసరమైతే స్వయంగా పరిశీలనకు వెళ్తా. యువతులు, మహిళలు, బాలికల రక్షణకు చర్యలు తీసుకుంటాం.

– షేక్ అబ్దుల్ అజీజ్, డీఎస్పీ, గుంటూరు ఈస్ట్

నిర్లక్ష్యపు 'కూటమి'

గుంటూరు నగరంలో పోకిరీల బెడద అధికమైపోయింది. నిత్యం విద్యార్థినులను వేధిస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కూటమి పాలకులు మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదు.

- కూటమి సర్కార్ వచ్చాక ఓ విద్యార్థినిని వేజండ్లకు చెందిన ఓ వ్యక్తి నెహ్రూనగర్ ప్రాంతానికి అర్ధరాత్రి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు.
- పాత గుంటూరు పోలీసుస్టేషన్ పరిధిలో 9వ తరగతి బాలికపై వెల్డింగ్ పని చేసే వ్యక్తి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఇంట్లో చెబితే చంపుతానని భయపెట్టాడు. ఆఖరికి బాలిక గర్భం దాల్చింది. తర్వాతే దారుణం వెలుగుచూసింది.
- మహిళా కళాశాల, హిందూ కళాశాల, ఏసీ కళాశాల, అభ్యుదయ కళాశాల విద్యార్థినులు రాకపోకలు సాగించే సమయంలో పోకిరీలు చేస్తున్న ఆగడాలు అన్నీఇన్నీకావు.
- పాతగుంటూరు స్టేడియం, శంకర్‌విలాస్ సెంటర్, నాజ్‌సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, లక్ష్మీపురం ప్రధాన రహదారి, కొరిటెపాడు తదితర ప్రాంతాల్లో విద్యార్థినులు బస్సులు ఎక్కి కళాశాలలకు, తిరిగి నివాసాలకు వచ్చే సమయంలో ఆకతాయిల చేష్టలతో విసిగిపోతున్నారు.
- ఇటీవల ఉమెన్స్ కళాశాల వద్ద జరిగిన ఘటనలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు ఒక రోజు హడావుడి చేసి చేతులు దులుపుకొన్నారు. ఇటువంటి ఘటనలు నగరంలో కొకొల్లలనే చెప్పాలి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



ఉమెన్స్ కళాశాల వద్ద కూర్చున్న యువకులు

ఆదమరిస్తే అంతే సంగతులు



వల్లాపల్లి వద్ద జారుడు బల్లను తలపిస్తున్న డైవర్షన్ రోడ్డు

వల్లాపల్లి వద్ద డైవర్షన్ రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం

బల్లికురవ: సాగర్ కాలువకు నీటి విడుదల సమయంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడం సమస్యగా మారింది. డైవర్షన్ రోడ్డులో వర్షం కురిసిన సమయంలో జారుడు బల్లలా మారుతోంది. ఆదమరిస్తే 20 అడుగుల లోతులో ఉన్న కాలువలో పడాల్సిందే. బల్లికురవ- అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్డులోని వల్లాపల్లి–ధర్మవరం గ్రామం మధ్య అద్దంకి బ్రాంచ్ కాలువ 33/0 వద్ద.. గతంలో ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.65 కోట్లు జూన్ మాసాంతంలో మంజూరయ్యాయి. ఇప్పటికీ పనులు పూర్తికాకపోవడంతోపాటు సాగర్ కాలువ నీటి విడుదలతో కొంత జాప్యం జరిగింది. డైవర్షన్ రోడ్డుకు బురద మట్టి తోలడంతో పాటు గ్రానైట్ ఎగుమతి చేసే ఖాళీ భారీ వాహనాలు కూడా ఈ డైవర్షన్ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగించడంతో గోతులు ఏర్పడ్డాయి. భారీ వాహనాల రాకపోకలు నిషేధం అంటూ బల్లికురవ అద్దంకి, అంబడిపూడి వద్ద బోర్డులు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేయడంతో పాటు డైవర్షన్ రోడ్డులో ఏర్పడ్డ గోతులకు ఎర్రమట్టి తోలి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని వాహన చోదకులు, ప్రజలు వేడుకుంటున్నారు.



అంబడిపూడి వద్ద ఏర్పాటు చేసిన భారీ వాహనాల నిషేధం బోర్డు

లాంచీస్టేషన్ ఆదాయం రూ.1,78,450



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండకు శనివారం పర్యాటకులు లాంచీలలో తరలి వెళ్లడంతో లాంచీస్టేషన్‌కు రూ.1,78,450 ఆదాయం సమకూరినట్లు యూనిట్ అధికారులు పేర్కొన్నారు. కొండను సందర్శించిన పర్యాటకులు మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం, మ్యూజియంలోని తొమ్మిది అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన శిలాఫలకాలను తిలకించారు. అనంతరం మాచర్ల మండలంలోని అనుపు, ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు.

భ్రమరాంబిక అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం అమ్మవారిని లక్ష గాజులతో శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర శర్మ, రామకృష్ణ భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు.

క్లుప్తంగా

సినీ ఫక్కీలో చోరీ

మద్యం దుకాణం నుంచి రూ.22 వేల విలువైన మద్యం సీసాలతో పరారీ

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని ఓ వైన్స్ షాపు నుంచి సినీ ఫక్కీలో రెండు కేసుల మందు బాటిళ్లతో ముగ్గురు యువకులు పరారైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానిక కొణిదెన రోడ్డులో గల వైన్స్ షాపు వద్దకు ముగ్గురు యువకులు స్కూటీపై వచ్చారు. వారిలో ఓ యువకుడు షాపు ముందు స్కూటీని ఆన్‌లో ఉంచుకొని నిలబడి ఉన్నాడు. మరో యువకుడు సుమారు రూ.22 వేల విలువగల రెండు కేసుల మద్యం సీసాలను కొనుగోలు చేసి స్కూటీ ముందు ఉంచాడు. మూడో యువకుడు కౌంటర్లో ఉన్న వ్యక్తికి ఫోన్ పే చేస్తున్నానంటూ చేసినట్లు నటించి అతను సరి చూసుకునే లోపే స్కూటీ ఎక్కి ముగ్గురూ పరారయ్యారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నలుగురు అరెస్ట్, నగదు స్వాధీనం



యద్దనపూడి: మండలంలోని లింగారావుపాలెం గ్రామం శివారులో జరుగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్‌ఐ టి శివరామకృష్ణ సిబ్బందితో కలసి స్థావరంపై ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి మొత్తం రూ.19,200 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనవద్దని, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులు ఇలాగే కొనసాగుతాయని తెలిపారు.

రైతులు, కౌలురైతులను ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

బాపట్ల: అకాల వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పేర్కొన్నారు. బాపట్లలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో పార్టీ శాఖా కార్యదర్శులు, పట్టణ, మండల కమిటీ సభ్యుల జిల్లాస్థాయి తరగతులు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి కృష్ణమోహన్ అధ్యక్షతన శనివారం జరిగాయి. గంగయ్య మాట్లాడుతూ వారం రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని తెలిపారు. దీనివల్ల రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు చొరవ తీసుకుని నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఎక్కువ చోట్ల వరిని వెద పెట్టడం వల్ల నీట మునిగి నష్టపోయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులతో పేద ప్రజలు ఇబ్బందులు గురవుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టి మైక్రో ఫైనాన్స్ సంస్థలపై నిఘా ఉంచి పేదలను దోపిడీ చేసిన వారిపై చర్య తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని అన్నారు. పార్టీ జిల్లా నాయకులు సీహెచ్ మజుందర్, ఎం వసంతరావు, ఎన్ బాబురావు, సీహెచ్ మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు అధికారి వెంకటేశ్వర్లుకు సర్వీసు అవార్డు



ముఖ్యమంత్రి నుంచి సర్వీసు అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

బాపట్ల: రిటైర్డ్ పోలీసు అధికారి అద్దంకి వెంకటేశ్వర్లు శుక్రవారం విజయవాడలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుంచి పోలీస్ మెడల్ ఫర్ మెమోరియస్ సర్వీస్ అవార్డును అందుకున్నారు. పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన వెంకటేశ్వర్లు ఒంగోలు పీటీసీలో సీఐగా ఉద్యోగ విరమణ చేశారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పులిగడ్డవారిపాలేనికి చెందిన ఆయన కానిస్టేబుల్‌గా 1983లో చేరి, అంచెలంచెలుగా ఎదిగారు. ఉద్యోగ సమయంలో 205 రివార్డులతోపాటు ఉత్తమ సేవా పతకం, సెంట్రల్ హోం మినిస్టర్ మెడల్, ఇండియన్‌పోలీస్ మెడల్ అందుకున్నారు. ముఖ్యంగా లాలాపేటలో దొంగనోట్ల కేసు, గోల్డ్ కుంభకోణం, ఎర్రచందనం వంటి పలు కేసులను ఛేదించడంలో కీలకంగా పనిచేశారు. పల్నాడు ప్రాంతంలో పనిచేసిన కాలంలో నక్సలైట్ల కేసులో చురుకుగా పనిచేసి పలువురిని అరెస్ట్ చేశారు.

పేద విద్యార్థులకు సాయం

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి వారి భవిష్యత్‌కు వెంకటేశ్వర్లు బంగారు బాట వేశారు. పలువురు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. 2003లో మెట్టగొడపాలేనికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని దత్తత తీసుకుని పూర్తిగా ఆర్థిక సాయం అందించారు. 2012లో ఐలవరంలో ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం, భట్టిప్రోలులో ఎస్‌ఐగా పనిచేస్తున్న సమయంలో వెల్లటూరులో తండ్రి అప్పుల ఊబిలో చిక్కుకుని చనిపోతే కూతురుని చదివించారు. ప్రస్తుతం ఆమె పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. 2018లో దాచేపల్లిలో ఓ బాలికను దత్తత తీసుకుని ఉన్నత చదువులు చదివించి, మానవత్వం చాటుకున్న పోలీస్‌గా నిలిచారు.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు

ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, బీసీ నాయకులు

నరసరావుపేట: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు, రైతు బాంధవుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, పలువురు బీసీ నాయకులు హాజరై గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ బడుగుల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న అంటూ కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతంలోని బలహీన వర్గాలకు చెందిన గీత కార్మిక గౌడ కులానికి చెందిన వారని, తన 17 ఏళ్ల వయస్సులోనే స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్న యువకిశోరం అన్నారు. తన 33 ఏళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమానికి దక్షిణ భారతదేశం నుంచి నాయకత్వం వహించారని, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్త్ర బహిష్కరణ, శాసనోల్లంఘన ఉద్యమాలు నిర్వహించి ప్రజలచే 'సర్దార్' బిరుదుతో పిలిపించుకున్న మొట్టమొదటి స్వాతంత్య్ర సమరయోధుడన్నారు. గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మురళి మాట్లాడుతూ స్వాతంత్య్రానికి పూర్వం ఆ తరువాత రాజకీయాలను వారు తీవ్రంగా ప్రభావితం చేశారన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, మరోసారి ఎమ్మెల్సీగా సమర్థవంతంగా పనిచేశారన్నారు. మొట్టమొదటి ఆల్ ఇండియా కిసాన్ మహాసభను మన రాష్ట్రంలో నిర్వహించారని, ఆయన మన రాష్ట్రంలో పుట్టడం మనకు గర్వకారణమన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, తహసీల్దార్, వేణుగోపాలరావు, బీసీ వెల్ఫేర్ జిల్లా ఆఫీసర్ కే.శ్రీనివాసులు, నాగారపు గురు ఆంజనేయులు, సుతారం విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి



సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ శ్రీకాకుళంలో జన్మించిన సర్దార్ గౌతు లచ్చన్న భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ గౌరవం పొందిన ఏకైక వ్యక్తి అన్నారు. లచ్చన్న సాహసానికి, కార్యదక్షతకు ప్రజలిచ్చిన బిరుదు సర్దార్ అని తెలిపారు. జాతీయ నాయకులతో కలిసి స్వాతంత్య్ర పోరాటాలలో పాల్గొని అనేక సార్లు జైలుకు వెళ్లారని తెలిపారు. బడుగువర్గ పోరాట జీవిగా లచ్చన్న చరిత్రలో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన), ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, ఎంటీ ఆర్‌ఐ ఎస్.కృష్ణ, ఏఎస్ఎస్ ఆర్‌ఐ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జీవితం ఆదర్శప్రాయం

నగరంపాలెం: సర్దార్ గౌతు లచ్చన్న జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మునిగిన జాగిరి వంతెన

- గుంటూరు నల్ల డ్రెయిను-2కు గండ్లు
- పలు గ్రామాల్లో 5 వేల ఎకరాలు మునక
- నేటికీ చేలనుంచి తొలగని నీరు
- రైతుసంఘం నేత పర్యటనలో సమస్యలు వెల్లడించిన శలపాడు రైతులు



జాగిరి వంతెన వద్ద నీటిలో శివసాంబిరెడ్డి, రైతులు

చేబ్రోలు: ఇటీవల కురిసిన భారీవర్షానికి గుంటూరు నల్ల డ్రెయిను-2కు రెండు, మూడుచోట్ల గండ్లు పడి పంటపొలాలను వరదనీరు ముంచెత్తింది. చేబ్రోలు మండలంలోని శలపాడు వద్దగల జాగిరి వంతెన సైతం మునిగిపోయింది. ఫలితంగా దాదాపు 5 వేల ఎకరాల్లో వెదపెట్టిన వరిపైరు దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శనివారం ఆయా పంటపొలాలను సందర్శించినపుడు రైతులు ఈ విషయాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

- శలపాడు, సుద్దపల్లి, వేజెండ్ల, మీసరగడ్డ, వెంకట కృష్ణాపురం గ్రామాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు ఉపయోగిస్తారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుందని, మరమ్మతులు చేయాలని ఎంతోకాలంగా మొరపెట్టుకుంటున్నా తమ వేదన అరణ్యరోదనగా మిగిలిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే రెండు సార్లు వరి వెదపెట్టటం వల్ల ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చుపెట్టామని, పొలం గట్టుమీద ఉంచిన రూ.15 వేల విలువజేసే ఎరువులు వర్షానికి తడిసి ముద్దయినట్టు శలపాడు రైతు కావూరి వాసుదేవరావు చెప్పారు. తమకు హైలెవల్ ఛానల్ నుంచి సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మరో మహిళా రైతు కోరారు.
- ములకా శివసాంబిరెడి మాట్లాడుతూ ప్రభుత్వం సత్వరమే ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభించాలని వాస్తవ సాగుదారులకు ఎకరాకు రూ.10 వేల ఆర్థికసాయంతోపాటు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. గుంటూరు నల్ల డ్రెయిన్‌కు పడిన గండ్లను పూడ్చాలని కోరారు. వీరితో రైతులు తాతా శ్రీనివాసరావు, కొడాలి శ్రీకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. సోమవారం మండల తహసిల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందిస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాగంలో పల్నాడు నేతలకు చోటు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురు నాయకులను పార్టీ రాష్ట్ర విభాగంలో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఇరిగిదిండ్ల లాజర్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ సంయుక్త కార్యదర్శిగా, పెదకూరపాడు అసెంబ్లీ నియోజకర్గానికి చెందిన షేక్ దస్తగిరిని రాష్ట్ర బీసీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఆర్‌టీయూసీ విభాగం సంయుక్త కార్యదర్శిగా ఏడుకొండలు



భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఆర్‌టీయూసీ విభాగం సంయుక్త కార్యదర్శిగా వేమూరుకు చెందిన బొల్లిముంత ఏడుకొండలును నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఏడుకొండలు నియామకం కోసం వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు కృషి చేశారు. ఏడుకొండలు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మీ కోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు

నరసరావుపేట: మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 18వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు.

వంకాయలపాడు వద్ద రోడ్డు ప్రమాదం

– దంపతులకు తీవ్ర గాయాలు

యడ్లపాడు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలైన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు బైక్‌పై భార్యాభర్తలు ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న ఒక స్కూటీ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనాలు ధ్వంసం కావడంతోపాటు దంపతులిద్దరూ బైక్‌పై నుంచి కింద పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను చిలకలూరిపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

ఆటోను ఢీకొన్న లారీ

ఇద్దరికి తీవ్రంగా..నలుగురికి స్వల్ప గాయాలు





ప్రమాదంలో గాయపడిన ఈశ్వరమ్మ, సారంగమ్మ

పిడుగురాళ్ల: ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొన్న సంఘటనలో ఆరుగురికి గాయాలైన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని కళ్లం టౌన్‌షిప్ వద్ద చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి సేకరించిన వివరాల మేరకు... మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామం నుంచి ఐదుగురు నరసరావుపేటలోని ఇస్కాన్ ఆలయానికి ఆటోలో బయలుదేరారు. మార్గంమధ్యలో ఈశ్వరమ్మ, సారంగమ్మలు అయ్యప్పనగర్ వద్ద ఆటో ఎక్కారు. హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న కంటైనర్ లారీ ఆటోను ఢీకొంది. ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ఈశ్వరమ్మ, సారంగమ్మలను 108 వాహనం ద్వారా, నామ్స్ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌లో పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనకు కారణమైన లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలిపెట్టి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

నేడు, రేపు సీపీఐ జిల్లా మహాసభలు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో ఆది, సోమవారాలలో రెండు రోజుల పాటు సీపీఐ గుంటూరు జిల్లా 26వ మహాసభలు జరగనున్నాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గుంటూరు కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితర నాయకులు హాజరుకానున్నారని తెలియజేశారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలకు అదనపు నోటిఫికేషన్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కుచట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు విడుదల చేసిన అదనపు నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను బడుగు, బలహీనవర్గాల పిల్లలకు కేటాయించిన నేపథ్యంలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల అర్హతలను ఈనెల 21న నిర్ధారించడంతో పాటు ఈనెల 25న లాటరీ ద్వారా ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. లాటరీ ద్వారా సీటు పొందిన విద్యార్థులు ఈనెల 31లోపు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్ ఖరారు చేసుకోవాలని సూచించారు. cse.ap.gov.in సైట్‌లో ఉంచిన దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేయాలని, ఒకసారి దరఖాస్తు సమర్పించిన తరువాత మార్పులకు ఆస్కారం లేదన్నారు. ఐదు కి.మీ. పరిధిలోని ప్రైవేటు పాఠశాలలే వెబ్‌సైట్‌లో కనిస్తాయని, ఆయా పాఠశాలల్లోనే 25 శాతం కోటా అందుబాటులో ఉన్న సీట్లు డిస్‌ప్లే అవుతాయన్నారు. విద్యార్థి సోదరీ, సోదరుడు అదే పాఠశాలలో ఇప్పటికే చదువుతూ ఉంటే అడ్మిషన్ల కోసం సంబంధిత పాఠశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అడ్మిషన్ పొందగోరు బాలలతో పాటు తల్లిదండ్రులు, సంరక్షులకు ఆధార్ తప్పనిసరి అని, ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ కోస ఆధార్, విద్యుత్ బిల్లు, ఇంటి పన్ను, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్‌కార్డులలో ఒకటి అప్లోడ్ చేయాలన్నారు. గతలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, గతంలో బీపీఎల్ కోటగా కింద అనర్హులుగా ప్రకటించిన వారు దరఖాస్తు చేయరాదన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బి.రవి
- దొడ్లేరు గ్రామంలో పర్యటన



వీధులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ రవి, జిల్లా మలేరియా అధికారి రత్నాకర్

దొడ్లేరు(క్రోసూరు): ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బి.రవి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతమైన మండలంలోని దొడ్లేరు గ్రామాన్ని శనివారం జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బి.రవి సందర్శించారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్‌తో కలసి గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లను పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ చర్యలను, ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. గర్భిణులు, పిల్లలకు తక్షణమే వైద్య సేవలు అందించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల ఉధృతి పెరగకుండా మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. హసనాబాద్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మొగల్ సుభాన్‌బేగ్ ఉన్నారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

క్లీనరు మృతి



మృతి చెందిన సంతోష్ (ఫైల్)

గుడ్లూరు: ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి కావేరి ట్రావెల్ బస్సు ఢీ కొనడంతో బస్సులో ఉన్న క్లీనర్ మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున తెట్టు ఓవరు బ్రిడ్జి దగ్గర జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు అదే మార్గంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనరు ఉండ్రరాశి సంతోష్ (27) మృతి చెందాడు. మృతుడు సంతోష్‌ది కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం పెద ఓగిరాల గ్రామం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గుడ్లూరు ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు.